RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక




హైదరాబాద్ | శుక్రవారం 26-6-2026 | సంచిక: 13 | సంఖ్య: 270 పేజీలు: 4 | వెల: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి

## ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల నియంత్రణపై
# నారా లోకేష్ దృష్టి..
## అధికారులకు కీలక ఆదేశాలు

ప్రభుత్వ పాఠశాలలకు లక్షకు పైగా కొత్త అడ్మిషన్లు

ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల నియంత్రణపై అధ్యయనానికి ఆదేశం

సెప్టెంబర్ 5 నుంచి ఏఐ ట్యూటర్ విధానం పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభం

అమరావతిలో సెంట్రల్ లైబ్రరీ నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడంతో పాటు, అభ్యసన ఫలితాలపై ఈ విద్యా సంవత్సరం ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను



2లో

## రియల్ ఎస్టేట్‌ను బొంద పెట్టింది రేవంత్ ప్రభుత్వమే: కేటీఆర్

రూ.కోటి విలువ భూములు ఇప్పుడు రూ.60 లక్షలకు కూడా అమ్ముడవడం లేదని వ్యాఖ్య

కేసీఆర్ హయాంలో పరిశ్రమలతో భూముల విలువలు పెరిగాయని వెల్లడి

ఎన్నికల హామీలను కాంగ్రెస్ అమలు చేయలేదని ఆరోపణ

రైతు బంధు, దళిత బంధు అంశాల్లో ప్రజలను మోసం చేశారని విమర్శ

2028లో కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని కార్యకర్తలకు పిలుపు

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ రంగం తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికల ముందు రియల్ ఎస్టేట్‌పై గొప్పలు చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. అధికారంలోకి వచ్చిన తర్వాత



2లో

# పశ్చిమాసియాలో నెలకొంటున్న శాంతి

ఉద్రిక్తతలు తగ్గడంతో మార్కెట్లో సానుకూల పరిస్థితి

72.28 డాలర్లకు పడిపోయిన బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర

బంగారం ధరలు కూడా భారీగా తగ్గుతున్నట్లు అంచనా

## పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా ఇళ్లు
### క్యూర్ పరిధిలో పది అంతస్తుల్లో ఇందిరమ్మ ఇండ్లు

జూన్ 28లోగా లొకేషన్ల ఖరారు.. జూలై మొదటి వారంలో బ్రోచర్ విడుదల

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్,జూన్25(ఆర్ఎన్ఎ): పేదల సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆ కల నెరవేర్చే క్రమంలో

# స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలి



### అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి
### కార్యకర్తలకు సిఎం చంద్రబాబు దిశానిర్దేశం

మంత్రాలయం: మరో మూడు నెలల్లో జరగనున్న స్థానిక ఎన్నికల్లో తెదేపా ఘన విజయం సాధించాలని ఆ పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు శ్రేణులకు పిలుపునిచ్చారు. కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం మాధవరంలో తెదేపా శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. కర్ణాటకలోని

2లో



# ఐకమత్యంతోనే రాష్ట్రాల అభివృద్ధి సాధ్యం
## జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ సూచన
## దేశంలో డ్యాంల పూడికతీతకు భారీ ప్రణాళిక

పరస్పర సహకారంతోనే తుంగభద్రకు 33 కొత్త గేట్లు

దీంతో తుంగభద్ర సామర్థ్యం 30 శాతం పెరుగుతుంది

తుంగభద్ర గేట్ల ఆధునికీకరణతో 3 తరాల నీటి సమస్యకు పరిష్కారం: రేవంత్

నదుల లింకింగ్‌తో భారత్ ఏకతాటిపైకి: పాటిల్

ఇచ్చిపుచ్చుకుంటేనే ప్రయోజనం: చంద్రబాబు

రైతుల కోసం సమన్వయంతో పనిచేస్తాం: డీకే

తుంగభద్ర నదీ జల వివాద పరిష్కారం కోసం కేంద్రం నేతృత్వంలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన సీనియర్ అధికారులతో 'హైలెవల్ కమిటీ (ఉన్నత స్థాయి కమిటీ)' వేస్తామని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ప్రకటించారు. ఈ కమిటీ 100 రోజుల్లోగా జల వివాదాల పరిష్కార చర్యలు చేపడుతుందని స్పష్టం చేశారు. దాదాపు 70 ఏళ్లుగా తుంగభద్ర నీటి కోసం వివాదాలు నెలకొన్న నేపథ్యంలో వాటిని పరిష్కరించడానికి జలశక్తి మంత్రి చొరవ చూపారు. తుంగభద్ర డ్యాంకు ఏర్పాటు చేసిన కొత్త క్రస్ట్ గేట్లను పాటిల్ గురువారం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ సీఎంలు చంద్రబాబు, డీకే శివకుమార్, ఎ.రేవంత్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు.

# ఉద్యోగులకు భారీ భరోసా..




## ఉచిత బీమా, పీఆర్సీపైనా సీఎం హామీ

రాష్ట్ర ఉద్యోగులు, పెన్షనర్లకు ఉచిత ప్రమాద బీమా

14 బ్యాంకులతో తెలంగాణ ప్రభుత్వం ఎంఓయూలు

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా వర్తింపు

ప్రమాద బీమా కవరేజీ రూ.1 కోటి నుంచి రూ.1.5 కోట్లు

విమాన ప్రమాద బీమా రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్లు

పీఆర్సీ హామీని తప్పకుండా అమలు చేస్తామని సీఎం స్పష్టం

2లో

## 27న భద్రాచలం దేవస్థానం అభివృద్ధి పనులకు శ్రీకారం

ఆగమశాస్త్ర ప్రకారం ఆలయ అభివృద్ధి పనులు

యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి

అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం



2లో

## కూటమి పాలనలో డ్వాక్రా మహిళలకు అన్యాయం: వైఎస్ జగన్

డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చలేదని జగన్ ఆరోపణ

దీనివల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన

రుణాలపై వడ్డీ రాయితీ హామీని విస్మరించడం వల్ల మహిళలకు రూ.6 వేల కోట్లు నష్టం

వైసీపీ హయాంలో వడ్డీ రాయితీ కింద రూ.4,969 కోట్లు చెల్లించామని వెల్లడి

## పాస్‌పోర్టు ఫీజులు భారీగా పెంచిన కేంద్రం
### జూలై 1నుంచి కొత్త ఫీజులు అమలు

న్యూఢిల్లీ:కేంద్రం తాజాగా పాస్‌పోర్టు ఫీజులను పెంచింది. కొత్త ఫీజులు వచ్చే నెల 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. కేంద్రం ప్రకటన ప్రకారం, 18 ఏళ్లు పైబడిన వారు కొత్త పాస్‌పోర్టు (36 పేజీలు) లేదా పాస్‌పోర్టు రీఇష్యూ కోసం ఇకపై రూ.2,500 చెల్లించాల్సి ఉంటుంది.

2లో



నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

# ఐకమత్యంతోనే రాష్ట్రాల అభివృద్ధి సాధ్యం

తొలుత 17, 18, 19, 20వ నంబరు గేట్ల వద్ద పూజలు నిర్వహించి.. జాతికి అంకితం చేశారు. అనంతరం డ్యాం దిగువన కొప్పళ జిల్లా మునిరాబాద్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించారు. ఏపీ, కర్ణాటక నుంచి పెద్దసంఖ్యలో రైతులు తరలివచ్చారు. తుంగభద్ర సంబంధిత వివాదాల పరిష్కారం కోసం కేంద్రం సీనియర్ అధికారులతో త్వరలోనే ఉన్నత స్థాయి కమిటీ వేస్తుందని పాటిల్ తెలిపారు. ఈ కమిటీ కొన్ని ఆప్షన్లు ఇస్తుందని.. వాటిలో ప్రయోజనం చేకూర్చేవాటిని ఆయా రాష్ట్రాలు ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఈ ప్రతిపాదనను ముగ్గురు సీఎంలు స్వాగతించారు. దేశవ్యాప్తంగా అనేక ఆనకట్టల్లో 15 శాతానికి పైగా పూడిక పేరుకుపోయిందని, దీంతో నీటినిల్వ సామర్థ్యం గణనీయంగా తగ్గిపోయిందని పాటిల్ చెప్పారు. సమస్య శాశ్వత పరిష్కారానికి పూడిక తొలగింపు కోసం కేంద్రం సొంత నిధులతో త్వరలో భారీ ప్రణాళిక అమలు చేయనుందని తెలిపారు.గేట్లను అమర్చడం సాధ్యమైందని గుర్తుచేశారు. నదీ జలాల విషయంలో ఉత్తరాది రాష్ట్రాలు సమన్వయంతో.. సామరస్యపూర్వకంగా వివాదాలకు తావులేకుండా పరిష్కరించుకుంటున్నాయని పాటిల్ వివరించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలు కూడా



కేంద్ర నిధులను సద్వినియోగం చేసుకుంటూ నదుల అనుసంధాన పథకాన్ని చేపట్టేందుకు ముందుకు రావాలని పాటిల్ సూచించారు.తమకొక రాష్ట్రం ఎక్కువ కాదు.. మరో రాష్ట్రం తక్కువా కాదని స్పష్టం చేశారు. రాష్ట్రాలు బాగుపడితేనే దేశం అభివృద్ధి సాధిస్తుందని కేంద్రం బలంగా నమ్ముతోందన్నారు.

**బాబు పట్టుదలతో ఓ నగరమే అభివృద్ధి**

'బెంగళూరు సహజసిద్ధంగా అభివృద్ధి చెందిన నగరం. ఇక్కడి వాతావరణం, లాజిస్టిక్స్ నగరాభివృద్ధికి దోహదపడ్డాయి. కానీ హైదరాబాద్ పరిస్థితి అలా కాదు. ఆ నగరాన్ని చంద్రబాబు పట్టుదల, అనుభవం, దూరదృష్టితో ఐటీతోపాటు అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారు' అని సీఎం డీకే శివకుమార్ ప్రశంసించారు. కొత్త గేట్ల ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు కర్ణాటక వెళ్లిన చంద్రబాబు హోస్పేట్‌లోని ఐఆర్బీ అతిథిగృహంలో శివకుమార్, రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా శివకుమార్ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తాను, చంద్రబాబు ఇద్దరం యువజన కాంగ్రెస్ నుంచి వచ్చిన వారిమేనని.. ఆయన పోరాటస్ఫూర్తి, పట్టుదల, దూరదృష్టి గురించి పలు సందర్భాల్లో తాను మాట్లాడుతుంటానని చెప్పారు. కేంద్ర మంత్రి పాటిల్ సైతం.. దేశంలో అభివృద్ధిపై దృష్టి సారించిన నాయకుల్లో చంద్రబాబు ముందువరుసలో ఉంటారని చెప్పారు.

**చంద్రబాబు శ్రద్ధే కారణం**

తుంగభద్ర డ్యాంకు యుద్ధప్రాతిపదికన కొత్త క్రస్ట్‌గేట్లను అమర్చడంపై ఏపీ సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ చూపారని, లేకుంటే ఈ క్రస్ట్ గేట్ల అమరిక మరో నాలుగైదేళ్లు ఆలస్యమయ్యేదని ఇంజనీరింగ్/గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు అన్నారు. తుంగభద్ర డ్యాంపై ఆయన మాట్లాడారు. మరో 50 ఏళ్ల వరకూ డ్యాంకు ఎటువంటి ఇబ్బందీ తలెత్తదని భరోసా ఇచ్చారు.

# ఉద్యోగులకు భారీ భరోసా..

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఇతర తాత్కాలిక ఉద్యోగులకు కూడా ఉచిత ప్రమాద బీమా సదుపాయం కల్పించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు 14 బ్యాంకులతో ప్రభుత్వం అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో సీఎం స్వయంగా ఒప్పందాలపై సంతకాలు చేసి పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం, ప్రభుత్వం కోసం కష్టపడే ఉద్యోగుల భద్రతను కాపాడటం తమ బాధ్యత అని చెప్పారు. ఉద్యోగులు అడగక ముందే ప్రభుత్వం ముందడుగు వేసి ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. పదవీ విరమణ తర్వాత కూడా బీమా ప్రయోజనాలు కొనసాగించేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. ప్రమాద బీమా కింద ఉద్యోగులకు రూ.1 కోటి నుంచి రూ.1.5 కోట్ల వరకు కవరేజీ లభిస్తుందని తెలిపారు. విమాన ప్రమాదాల సందర్భంలో బ్యాంకులు రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు బీమా రక్షణ అందిస్తాయని వివరించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఉద్యోగులందరికీ సీఎం కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమంపై ప్రభుత్వం కట్టుబడి ఉందని రేవంత్ స్పష్టం చేశారు. పీఆర్సీ విషయంలో ఇచ్చిన హామీని కూడా తప్పకుండా అమలు చేస్తామని చెప్పారు. ఉద్యోగుల నమ్మకమే ప్రభుత్వానికి బలమని, ప్రభుత్వాలు మారినా ఉద్యోగ వ్యవస్థ శాశ్వతమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో జీతాలు చెల్లించలేని పరిస్థితి ఉండేదని విమర్శించిన సీఎం విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి నెలా తొలి రోజే జీతాలు చెల్లిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ఆదాయం పెరిగేలా ఉద్యోగులు ప్రతిరోజూ అదనంగా గంట పనిచేయాలని కోరారు. వచ్చే అదనపు ఆదాయాన్ని ఉద్యోగుల సంక్షేమానికే వినియోగిస్తామని హామీ ఇచ్చారు.అనంతరం రాజకీయ అంశాలపైనా స్పందించిన సీఎం తాను "గుంపు మేస్త్రీ"నని, రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేసే తన బృందానికి నాయకత్వం వహిస్తున్నానని అన్నారు. మూసీ నది ప్రక్షాళన, మెట్రో విస్తరణ వంటి అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతిపక్షాలు అడ్డంకులు సృష్టిస్తున్నాయని ఆరోపించారు.

## పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా ఇళ్లు

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్,జూన్25: పేదల సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆ కల నెరవేర్చే క్రమంలో వారి జీవనోపాధికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు అత్యంత సమీపంలోనే క్యూర్ పరిధిలో పది అంతస్తుల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పేదల ఉపాధి, పిల్లల చదువు, కుటుంబ జీవన వ్యవస్థ దెబ్బతినకుండా నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకొని వారు నివశిస్తున్న ప్రాంతాలలోనే వారికి గౌరవప్రదమైన నివాసం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలోని తన కార్యలయంలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, ఆర్‌డీఓ, తహసీల్దార్ కార్యాలయాల శాశ్వత భవనాల నిర్మాణం, భద్రాచలం దేవస్థానం అభివృద్ధి అంశాలపై అధికారులతో మంత్రి సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ ఏడాది క్యూర్ పరిధిలో లక్ష ఇండ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నామని, ప్రయోగాత్మకంగా తొలి విడతలో ప్రతి నియోజకవర్గానికి 500 చొప్పున ఇళ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. క్యూర్ పరిధిలోని 26 నియోజకవర్గాల్లో ఇప్పటికే దాదాపు 20 వరకు స్థలాలను గుర్తించామని, మిగిలిన ప్రాంతాల గుర్తింపు పక్రియను వేగవంతం చేసి ఈ నెల 28వ తేదీ లోగా అన్ని లొకేషన్లను ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రతి స్థలానికి సంబంధించిన ప్రణాళికలు, డిజైన్లు, నిర్మాణ నమూనాలను కూడా జూన్ 28లోగా సిద్ధం చేయాలని, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన విధివిధానాలు, అర్హతలు, దరఖాస్తు పక్రియ వివరాలతో కూడిన బ్రోచర్‌ను జూలై మొదటి వారంలో విడుదల చేస్తామని వెల్లడించారు. క్యూర్ పరిధిలో అత్యంత ముఖ్యమైన ప్రాంతాలల్లో కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూముల్లో ఇండ్ల నిర్మాణాలను చేపడుతున్నామని ఈ స్థలాల్లో అన్ డివైడెడ్ షేర్ క్రింద మహిళలకు వాటా కల్పిస్తూ ఆ భాగాన్ని మహిళల రిజిస్ట్రేషన్ చేస్తామని మరోమారు స్పష్టం చేశారు.

## ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల నియంత్రణపై నారా లోకేష్ దృష్టి..

ఆదేశించారు. ఉండవల్లిలోని తన నివాసంలో పాఠశాల విద్యశాఖపై ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖకు సంబంధించిన పలు కీలక వివరాలను అధికారులు మంత్రికి వివరించారు.ప్రస్తుత విద్యా సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు సుమారు 1,06,000 మంది విద్యార్థులు కొత్తగా ప్రవేశాలు పొందారని అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని మొత్తం 7,620 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 3,515 పాఠశాలలు (46.13 శాతం) ప్రస్తుతం పూర్తి సామర్థ్యంతో నడుస్తున్నాయని వారు వివరించారు. విద్యా రంగంలో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల వల్లే ఈ సానుకూల మార్పు చోటుచేసుకుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ సమావేశంలో ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల నియంత్రణ అంశంపై కూడా ప్రధానంగా చర్చించారు. ఫీజుల నియంత్రణకు సంబంధించి ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, నివేదిక సమర్పించాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. మరోవైపు, సెప్టెంబర్ 5 నుంచి మొదటి విడత కింద 175 'లీప్' పాఠశాలల్లో 9, 10 తరగతుల విద్యార్థుల కోసం 'ఏఐ ట్యూటర్' విధానాన్ని పైలట్ ప్రాజెక్టుగా చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. భవిష్యత్తులో ఈ విధానాన్ని 'క్లిక్కర్స్'కు అనుసంధానించాలని మంత్రి అధికారులకు సూచించారు.అమరావతిలో స్టేట్ సెంట్రల్ లైబ్రరీ, విశాఖపట్నంలో డిస్ట్రిక్ట్ సెంట్రల్ లైబ్రరీ, మంగళగిరిలో స్కిల్ ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటుపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. వచ్చే నెలలో అమరావతిలో సెంట్రల్ లైబ్రరీ నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి శ్యామలరావు, పాఠశాల విద్య డైరెక్టర్ తమీమ్ అన్సారియా తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పాస్‌పోర్టు ఫీజులు భారీగా పెంచిన కేంద్రం

గతంలో ఈ ఫీజు రూ.1,500గా ఉండేది. ఇక తత్కాల్ పథకం కింద ఇదే పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకునే వారి ఫీజు రూ.3,500 నుంచి రూ.5 వేలకు పెరిగింది. 60 పేజీల పాస్‌పోర్టు ఫీజు కూడా రూ.2 వేల నుంచి రూ.3,500కు పెరిగింది. తత్కాల్ పథకం కింద ఈ పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకునే వారు ఇకపై రూ.6 వేలు చెల్లించాల్సి ఉంటుంది. గతంలో ఈ ఫీజు రూ.4 వేలుగా ఉండేది. పాస్‌పోర్టు పోగొట్టుకున్న సందర్భాల్లో కొత్త పాస్‌పోర్టు (36 పేజీలు) కోసం ఇకపై రూ.5 వేలు చెల్లించాలి. తత్కాల్ స్కీమ్‌లో బుక్ చేసుకుంటే రూ.7,500 చెల్లించాల్సి ఉంటుంది. 60 పేజీల పాస్‌పోర్టు విషయంలో ఈ ఫీజులు వరుసగా రూ.6 వేలు, రూ.8,500 వేలకు పెరిగాయి. 18 ఏళ్ల పిల్లలకు కొత్త పాస్‌పోర్టు (36 పేజీలు) ఫీజు రూ.1,750గా నిర్ణయించింది.

# పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా ఇళ్లు

వారి జీవనోపాధికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు అత్యంత సమీపంలోనే క్యూర్ పరిధిలో పది అంతస్తుల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పేదల ఉపాధి, పిల్లల చదువు, కుటుంబ జీవన వ్యవస్థ దెబ్బతినకుండా నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకొని వారు నివశిస్తున్న ప్రాంతాలలోనే వారికి గౌరవప్రదమైన నివాసం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలోని తన కార్యలయంలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, ఆర్‌డీఓ, తహసీల్దార్ కార్యాలయాల శాశ్వత భవనాల నిర్మాణం, భద్రాచలం దేవస్థానం అభివృద్ధి అంశాలపై అధికారులతో మంత్రి సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ ఏడాది క్యూర్ పరిధిలో లక్ష ఇండ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నామని, ప్రయోగాత్మకంగా తొలి విడతలో ప్రతి నియోజకవర్గానికి 500 చొప్పున ఇళ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. క్యూర్ పరిధిలోని 26 నియోజకవర్గాల్లో ఇప్పటికే దాదాపు 20 వరకు స్థలాలను గుర్తించామని, మిగిలిన ప్రాంతాల గుర్తింపు పక్రియను వేగవంతం చేసి ఈ నెల 28వ తేదీ లోగా అన్ని లొకేషన్లను ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రతి స్థలానికి సంబంధించిన ప్రణాళికలు, డిజైన్లు, నిర్మాణ నమూనాలను కూడా జూన్ 28లోగా సిద్ధం చేయాలని, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన విధివిధానాలు, అర్హతలు, దరఖాస్తు పక్రియ వివరాలతో కూడిన బ్రోచర్‌ను జూలై మొదటి వారంలో విడుదల చేస్తామని వెల్లడించారు. క్యూర్ పరిధిలో అత్యంత ముఖ్యమైన ప్రాంతాలల్లో కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూముల్లో ఇండ్ల నిర్మాణాలను చేపడుతున్నామని ఈ స్థలాల్లో అన్ డివైడెడ్ షేర్ క్రింద మహిళలకు వాటా కల్పిస్తూ ఆ భాగాన్ని మహిళల రిజిస్ట్రేషన్ చేస్తామని మరోమారు స్పష్టం చేశారు. రాష్ట్రంలో హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఒకే మోడల్ లో ఆర్.డి.ఓ., తహశీల్దార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలను నిర్మిస్తున్నామని తెలిపారు. ఆయా జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకొని వీలైనంత త్వరితగతిన పనులు ప్రారంభించేలా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అలాగే, ఆర్.డి.ఓ. తహశీల్దార్ కార్యాలయాల భవనాల మరమ్మతులకు సంబంధించి హౌసింగ్ ఏ.ఈ. లు భవనాలను విజిట్ చేసి ప్రతిపధనలు పంపించాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి, డి.ఎస్. లోకేశ్ కుమార్, హౌసింగ్ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలి

హోసపేటెలో తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన అనంతరం సీఎం మాధవరం చేరుకున్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలతో ఆయన మాట్లాడుతూ పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు, మంత్రాలయం తెదేపా ఇన్‌ఛార్జ్ రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మన ప్రభుత్వం చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలి. తెదేపా నాయకులు నిరంతరం ప్రజల్లో ఉండాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచిన వారిని అక్కున చేర్చుకుంటా. ఓడిపోయిన వారిని పక్కన పెట్టేస్తా. కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి. మంత్రాలయం వైకాపా ఎమ్మెల్యే చిచ్చు పెడుతున్నారు.. ఆయనకు బుద్ధి చెబుతాం. 2029 ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం. అధికారం ఉంది కదా అని నేతలు ప్రజలకు అందుబాటులో లేకపోతే వారికి దూరమవుతారు. మంత్రాలయం తెదేపాలో అసమ్మతి, విభేదాలు లేకుండా అందరూ ఒక్కతాటిపైకి వచ్చి గెలుపుకోసం పని చేయాలని చంద్రబాబు సూచించారు.

# పశ్చిమాసియాలో నెలకొంటున్న శాంతి

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారడంతో చమురు రవాణాకు జీవనాడి అయిన హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలు వేగవంతం అవుతున్నాయి. దీంతో అంతర్జాతీయ మార్కెట్‌లో గత కొన్ని రోజులుగా చమురు ధరలు భారీగా దిగొస్తున్నాయి. తాజాగా బ్రెంట్ క్రూడ్ ధర అమెరికా-ఇరాన్ యుద్ధం ముందు స్థితికి పడిపోవడం ఊరటనిస్తోంది. గురువారం ఉదయం బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 72.28 డాలర్లకు పడిపోయింది. క్రితం సెషన్‌తో పోలిస్తే దీని ధర 4శాతం మేర తగ్గడం గమనార్హం. ఇక, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియెట్ క్రూడాయిల్ ధర 1.69శాతం తగ్గి బ్యారెల్‌కు 69.15 డాలర్లు పలికింది. ఇటీవలి కాలంలో దీని ధర 70 డాలర్ల దిగువకు చేరడం ఇదే తొలిసారి. గడిచిన 24 గంటల్లో హర్మూజ్ జలసంధి మీదుగా కనీసం 2 కోట్ల బ్యారెళ్ల చమురు రవాణా అయినట్లు అమెరికా ఇంధన మంత్రిత్వశాఖ వెల్లడించింది. రాబోయే కొన్ని వారాల్లోనే ఈ జలమార్గంలో చమురు రవాణా యుద్ధం మునుపటి స్థాయికి పెరుగుతుందని అంచనా వేసింది. పశ్చిమాసియాలో యుద్ధం ముగియడంతో పాటు ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షలను సడలించడం వంటి కారణాలతో క్రూడాయిల్ ధరలు దిగొస్తున్నాయి.అటు బంగారం, వెండి ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి.

## 27న భద్రాచలం దేవస్థానం అభివృద్ధి పనులకు శ్రీకారం

హైదరాబాద్:తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, దక్షిణ అయోధ్యగా ఖ్యాతి గాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం అభివృద్ధి పనులకు ఈ నెల 27వ తేదీన శ్రీకారం చుడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, భద్రాచలం ఆలయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ, భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఆగమశాస్త్ర నియమాలను కచ్చితంగా పాటిస్తూ ఆలయ అభివృద్ధి పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. భద్రాచలం ఆలయ వైభవం, ఆధ్యాత్మికతకు ఎటువంటి భంగం కలగకుండా, సంప్రదాయ శిల్పకళను ప్రతిబింబించేలా రాతి నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. రాబోయే రెండు వందల సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్ తరాలకు కూడా ఆదర్శంగా నిలిచే విధంగా ఆలయాన్ని అభివృద్ధి చేయాలని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు సంకల్పించారని ఈ మేరకు ఈ నెల 27వ తేదీన ఆలయ పునరుద్ధరణ పనులను అధికారికంగా ప్రారంభించాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వం నిర్దేశిరచిన గడువులోనే పనులు పూర్తయ్యేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. ఈ ఆలయ పునరుద్ధరణ పనులకు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు 351 కోట్ల రూపాయలను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. వచ్చే శ్రీరామ నవమి నాటికి నిర్దేశిరచిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడానికి ముందస్తుగానే పనుల విభజన చేసుకొని సమతరంగా అన్ని పనులు చేపట్టాలని సూచించారు.

## రియల్ ఎస్టేట్‌ను బొంద పెట్టింది రేవంత్ ప్రభుత్వమే: కేటీఆర్

అదే రంగాన్ని పూర్తిగా దెబ్బతీశారని విమర్శించారు. చేవెళ్ల నియోజకవర్గంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశం, ఎస్ఐఆర్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.ఎన్నికలకు ముందు రూ.కోటి పలికిన ఎకరం భూమి ప్రస్తుతం రూ.50-60 లక్షలకు కూడా కొనుగోలుదారులు దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. రియల్ ఎస్టేట్‌పై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది ఉపాధి కోల్పోయే పరిస్థితి వచ్చిందని ఆరోపించారు.కేసీఆర్ హయాంలో చేవెళ్ల ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చామని కేటీఆర్ చెప్పారు. షాబాద్ పరిసర ప్రాంతాల్లో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసి మైక్రోసాఫ్ట్, అమెజాన్, వెల్స్‌పన్ వంటి అంతర్జాతీయ సంస్థలను తీసుకొచ్చామని చెప్పారు. పరిశ్రమల విస్తరణతో ఒకప్పుడు రూ.30 లక్షలు ఉన్న ఎకరం భూమి విలువ రూ.3 కోట్లకు చేరిందన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయిందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా ఎన్నికల హామీల్లో ఒక్కటి కూడా పూర్తిగా అమలు కాలేదని కేటీఆర్ విమర్శించారు.

### కూటమి పాలనలో డ్వాక్రా మహిళలకు అన్యాయం: వైఎస్ జగన్

ప్రస్తుత పథకాన్ని కూడా ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శ

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఏపీలోని కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటోందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు గురువారం ట్విట్టర్ వేదికగా ఆయన స్పందించారు. డ్వాక్రా మహిళలకు రుణాలు అందిస్తే వారికి ఆర్థిక స్వావలంబన కలగడమే కాకుండా, ఉత్పాదక రంగాల్లో పెట్టుబడులు పెట్టే అవకాశం ఉంటుందని జగన్ పేర్కొన్నారు.ఎన్నికల మేనిఫెస్టోలో స్వయం సహాయక గ్రూపు రుణాలపై వడ్డీ రాయితీ పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతామని హామీ ఇచ్చి, ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేతులెత్తేసిందని జగన్ విమర్శించారు. ఈ హామీని అమలు చేయకపోవడం వల్ల మహిళలు ఏటా రూ.3 వేల కోట్ల చొప్పున రెండేళ్లకు రూ.6 వేల కోట్ల ప్రయోజనాన్ని కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.తమ హయాంలో డ్వాక్రా మహిళలకు వడ్డీ రాయితీ కింద రూ.4,969 కోట్లు చెల్లించామని, ఆసరా, చేయూత వంటి పథకాల ద్వారా ఆర్థికంగా అండగా నిలిచామని జగన్ గుర్తుచేశారు. పెంచిన రుణ పరిమితి సంగతి అటుంచి, ప్రస్తుతం ఉన్న వడ్డీ రాయితీ పథకానికి కూడా మద్దతు ఇవ్వకుండా కూటమి సర్కార్ నిర్వీర్యం చేసిందని ఆయన మండిపడ్డారు.




## ఎస్ఎస్ఆర్ఆర్ ఆధ్వర్యంలో వికలాంగుల బడి బాట

### దివ్యంగుల సంక్షేమానికి శిబిరాలు పెట్టడం హర్షనీయం

### ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

**భైంసా టౌన్, 25:** నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో స్నేహా సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వికలాంగుల బడి బాట-2026 కార్యక్రమనికి ముఖ్య అతిథిగా ముధోల్ శాసనసభ్యులు శ్రీ పవార్ రామారావు పటేల్ పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడుతూ వికలాంగ పిల్లలకు విద్య, వైద్యం అలాగే పునరావాస సేవలు అందించడం, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించి వారికి అవసరమైన సహాయ పరికరాలు, విద్యా అవకాశాలు కల్పించేందుకు ఇటువంటి శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపించి విద్యావంతులను చేయాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి అర్హత కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమోళ్ళ దత్తు, మండల విద్యాధికారి, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రత్యేక పాఠశాల నిర్వాహకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మీ కుటుంబానికే ఇలా జరిగితే?..

### బాధితుల పట్ల అమర్యాదగా నడుచుకుంటే ఊరుకోం: సజ్జనార్

**పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితుల పట్ల సిబ్బంది తీరుపై సీపీ సజ్జనార్ తీవ్ర ఆగ్రహం**

**క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకునేందుకు డెకాయ్ ఆపరేషన్లు నిర్వహణ**

**ఫిర్యాదుదారులతో అమర్యాదగా ప్రవర్తిస్తున్నట్లు రహస్య తనిఖీల్లో వెల్లడి**

**నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సస్పెన్షన్లు, బదిలీలు తప్పవని కఠిన హెచ్చరిక**

**పర్యవేక్షణ లోపించినందుకు కొందరు ఇన్‌స్పెక్టర్లకు ఛార్జిమెమోలు జారీ**



హైదరాబాద్ పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితుల పట్ల కొందరు సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుపై నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చే ప్రజలతో అమర్యాదగా, బాధ్యతారహితంగా ప్రవర్తిస్తున్న సిబ్బందిపై కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన ఉన్నతాధికారులను ఆదేశించారు. బంజారాహిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఇటీవల నిర్వహించిన ఉన్నత స్థాయి నేర సమీక్షా సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. "కష్టాల్లో ఉండి, మానసిక వేదనతో ఆసరా కోసం పోలీస్ స్టేషన్ గడప తొక్కే ప్రజలతో వ్యవహరించాల్సిన పద్ధతి ఇదేనా?" అంటూ అధికారులను సజ్జనార్ నిలదీశారు. కొన్ని స్టేషన్లలో రిసెప్షనిస్టులు, పరిపాలనా బాధ్యతలు చూసే అడ్మిన్ ఎస్సైల ప్రవర్తన సరిగా లేదని, సమయపాలన కూడా పాటించడం లేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పర్యవేక్షణ లోపించినందుకు కొందరు ఇన్‌స్పెక్టర్లకు ఇప్పటికే ఛార్జిమెమోలు జారీ చేసినట్లు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో, క్షేత్రస్థాయిలో వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు సీపీ సజ్జనార్ ఒక వినూత్న వ్యూహాన్ని అమలు చేశారు. ఆయన స్వయంగా డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించారు. కొందరు పోలీసు అధికారులనే సాధారణ పౌరులుగా, సివిల్ డ్రెస్‌లో ఫిర్యాదులు చేసేందుకు నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లకు పంపించారు. అక్కడ సిబ్బంది స్పందించిన తీరు, వారికి ఎదురైన అనుభవాలపై నివేదిక తెప్పించుకున్నారు. ఈ రహస్య ఆపరేషన్‌లో దాదాపు 12 పోలీస్ స్టేషన్లలో సిబ్బంది తీరు దారుణంగా ఉన్నట్లు వెల్లడైంది. ఫిర్యాదు చేయడానికి వెళ్లిన వారితో రిసెప్షనిస్టులు, ఏఎస్సైలు కఠినంగా మాట్లాడటం, అది తమ పరిధిలోకి రాదంటూ పక్క స్టేషన్లకు నెట్టేయడం, సూటిపోటి మాటలతో వేధించడం వంటివి ఈ తనిఖీల్లో బయటపడ్డాయి. అంతేకాకుండా, ఫిర్యాదును వెంటనే స్వీకరించకుండా 'రేపు రా.. మాపు రా..' అంటూ బాధితులను రోజుల తరబడి తిప్పించుకున్నట్లు స్పష్టమైంది. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి సజ్జనార్ భావోద్వేగంగా మాట్లాడారు. "మీ కుటుంబ సభ్యులే ఏదైనా సమస్యపై ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లినప్పుడు, అక్కడ ఇలాంటి ఇబ్బందికర పరిస్థితులే ఎదురైతే మీరెలా భావిస్తారో ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోండి" అని హితవు పలికారు. ఇకపై ప్రజా సమస్యల పట్ల అలసత్వం వహిస్తే సస్పెన్షన్లు, బదిలీలు తప్పవని ఆయన గట్టిగా హెచ్చరించారు.

# లంచం కేసులో చిక్కిన తహసీల్దార్.. రూ. 5 కోట్ల అక్రమాస్తులు గుర్తింపు!

### లంచం కేసులో పట్టుబడ్డ షామీర్‌పేట తహసీల్దార్ సుచరితపై మరో కేసు

### ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు తేలడంతో కేసు నమోదు చేసిన ఏసీబీ

### సోదాల్లో రూ. 5.05 కోట్ల విలువైన ఆస్తులు గుర్తించిన అధికారులు

### నెల క్రితం రూ. 2 లక్షల లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన సుచరిత

లంచం కేసులో అరెస్టయి సస్పెన్షన్‌కు గురైన షామీర్‌పేట మాజీ తహసీల్దార్ టి. సుచరిత మెడకు మరో ఉచ్చు బిగుసుకుంది. ఆమెపై ఆదాయానికి మించిన ఆస్తుల (డీఏ) కేసును అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) నమోదు చేసింది. లంచం తీసుకుంటూ పట్టుబడిన నెల రోజులకే ఈ కొత్త కేసు నమోదు కావడం గమనార్హం. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా షామీర్‌పేట మండలంలో తహసీల్దార్, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్, జాయింట్ సబ్-రిజిస్ట్రార్‌గా పనిచేసిన సుచరిత, ఆమె డ్రైవర్ వి. నగేష్‌ను మే 26, 2026న ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. 30 ఎకరాల వ్యవసాయ భూమికి నాలా (భూజ) మార్పిడి కోసం ఒక వ్యక్తి నుంచి ఎకరాకు లక్ష రూపాయల చొప్పున మొత్తం రూ. 30 లక్షలు డిమాండ్ చేశారు. అందులో భాగంగా రూ. 2 లక్షలు ముడుపులు



తీసుకుంటుండగా అధికారులు వీరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో అవినీతి ద్వారా అక్రమంగా ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై జూన్ 25న సుచరితపై ఏసీబీ అధికారులు అక్రమాస్తుల కేసు నమోదు చేశారు. ఆమె నివాసంతో పాటు ఇతర మూడు ప్రాంతాల్లో జరిపిన సోదాల్లో భారీగా ఆస్తులు బయటపడ్డాయి. అధికారులు స్వాధీనం చేసుకున్న వాటిలో రూ. 12 లక్షల నగదు, రూ. 1.2 కోట్ల విలువైన బంగారం, వజ్రాభరణాలు ఉన్నాయి. వీటితో పాటు బ్యాంకు ఖాతాల్లో రూ. 38 లక్షలు, ఒక వోక్స్‌వ్యాగన్, ఒక హ్యుందాయ్ క్రెటా కార్లు, హైదరాబాద్‌లో మూడు ఫ్లాట్లు, కీసర, ఖానామెట్ గ్రామాల్లో రెండు ప్లాట్లు, సిద్దిపేట జిల్లా దమ్మరకుంట గ్రామంలో వ్యవసాయ భూమి ఉన్నట్లు గుర్తించారు. ఈ ఆస్తుల మొత్తం విలువ సుమారు 5.05 కోట్లు రూపాయలుగా ఉంటుంది. లంచం కేసు తర్వాత సస్పెన్షన్‌కు గురైన సుచరితపై తాజాగా నమోదైన అక్రమాస్తుల కేసులో దర్యాప్తు కొనసాగుతోందని ఏసీబీ అధికారులు తెలిపారు.

# రాజ్యాధికార సమరభేరి సభకు సిద్ధం అవ్వండి

### నిర్మల్ జిల్లా సాంస్కృతిక శాఖ అధ్యక్షులు అష్ట దిగంబర్ కి ఆహ్వానం

### టీఆర్పీ రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల ప్రవీణ్ రాజ్, అష్ట తో భేటీ

### రాష్ట్ర నాయకుల ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రిక అందజేత



**(నిర్మల్ జిల్లా:** నిర్మల్ జిల్లా వ్యాప్తంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన "రాజ్యాధికార సమరభేరి" బహిరంగ సభకు సంబంధించిన ముమ్మర ప్రచారం అలాగే ఆహ్వానాల ప్రక్రియ జిల్లాలో వేగంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా నిర్మల్ జిల్లా కళాకారుల సాంస్కృతిక బృందం అధ్యక్షులు అష్ట దిగంబర్ పార్టీ ముఖ్య నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జ్ కొమ్ముల ప్రవీణ్ రాజ్, నిర్మల్ జిల్లా అధ్యక్షులు గైని సాయి మోహన్ కలిసి అష్ట దిగంబర్ అధికారిక ఆహ్వాన పత్రికను అందజేసి, రాజ్యాధికార సమరభేరి సభకు ముఖ్య అతిథిగా విచ్చేయాల్సిందిగా ఘనంగా పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కొమ్ముల ప్రవీణ్ రాజ్ మాట్లాడుతూ సమాజంలో చైతన్యం తీసుకురావడంలో, ప్రజల గుండె చప్పుడిని వినిపించడంలో కళాకారుల పాత్ర ఎంతో కీలకమైనదని కొనియాడారు. బహుజన, దళిత, పీడిత వర్గాల రాజ్యాధికార సాధన కోసం జరిగే ఈ మహా సభకు జిల్లాలోని కళాకారులు, సాంస్కృతిక రథసారధులు అందరూ తరలివచ్చి మద్దతు తెలపాలని, సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ ఆహ్వాన పత్రిక అందజేసిన కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ప్రధాన కార్యదర్శి జెడ్ లోడ్ శంకర్, మహిళా విభాగం అధ్యక్షురాలు లక్ష్మి ముఖ్య నాయకులు మారుతి,గోపి తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ భవన్‌లో నిర్వహించిన ఎస్టీ రిజర్వేషన్ల స్వర్ణోత్సవ బస్సు యాత్ర కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

### ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



**నల్గొండ జిల్లా :** హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో గిరిజనులు, ఎరుకలు, యానాది తెగలకు ఎస్టీ రిజర్వేషన్లు కల్పించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన ఎస్టీ రిజర్వేషన్ల స్వర్ణోత్సవ బస్సు యాత్ర కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తో పాటు రాష్ట్రంలోని గిరిజన ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు గిరిజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ, గిరిజనుల సామాజిక, విద్యా, ఆర్థిక అభివృద్ధికి ఎస్టీ రిజర్వేషన్లు కీలక మలుపుగా నిలిచాయని అన్నారు. గిరిజనులకు రాజ్యాంగబద్ధమైన హక్కులు కల్పించి వారి అభ్యున్నతికి బాటలు వేసిన కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మక పాత్రను గుర్తు చేశారు. గిరిజనుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ మరియు సమగ్ర అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. గిరిజన సమాజం సాధించిన విజయాలను స్మరించుకుంటూ, భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధించే దిశగా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గిరిజనుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి అభ్యున్నతి కోసం ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గిరిజన సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో గిరిజన యువత పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.

# హైదరాబాద్‌లో ఓ ఏటీఎంలో.. డ్రా చేసిన దానికన్నా రూ.2200 అధికంగా క్యాష్!

హైదరాబాద్‌లోని ఒక ఏటీఎంలో తలెత్తిన సాంకేతిక లోపం కారణంగా, నగదు విత్ డ్రా చేసిన ఓ వ్యక్తికి తాను అడిగిన దానికంటే ఎక్కువ మొత్తం వచ్చింది. సదరు వ్యక్తి తక్షణమే స్పందించి పోలీసులకు సమాచారం అందించడంతో, వారు ఘటనా స్థలానికి చేరుకుని ఏటీఎంను తాత్కాలికంగా మూసివేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సంఘటన గురువారం బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని షాహీన్‌నగర్‌లో చోటుచేసుకుంది. షాహీన్‌నగర్‌లోని హైవే హోటల్ సమీపంలో ఉన్న హిటాచీ ఏటీఎంలో ఓ వినియోగదారుడు నగదు డ్రా చేశాడు. అయితే, తాను కోరిన మొత్తం కంటే సుమారు రూ. 2,200 అదనంగా రావడంతో అతను విస్తుపోయాడు. వెంటనే ఈ విషయాన్ని బాలాపూర్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా, వారు హుటాహుటిన అక్కడికి చేరుకుని ఇతర వినియోగదారులు డబ్బులు ఉపసంహరించుకోకుండా ఏటీఎంను తాత్కాలికంగా మూసివేయించారు. యంత్రంలో తలెత్తిన సాంకేతిక లోపం వల్లే ఈ విధంగా అదనపు నగదు వచ్చి ఉంటుందని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ప్రస్తుతం ఏటీఎం లావాదేవీల వివరాలను, మెషిన్ పనితీరును అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఇప్పటివరకు నగదు నష్టపోయినట్లు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని, దర్యాప్తు పూర్తయ్యాక వాస్తవాలు వెల్లడవుతాయని పోలీసులు తెలిపారు. కాగా, వినియోగదారుడి నిజాయితీని పలువురు ప్రశంసిస్తున్నారు.



# ఈ సినిమా కోసం ఇంకెంతమంది హీరోయిన్లు?



తెలుగు సినిమాల్లో హీరోయిన్లు అనగానే అయితే ముంబై నుంచి వస్తారు లేదంటే మలయాళ భామలు ఎక్కువగా కనిపిస్తూ ఉంటారు. అందుకు తగ్గట్లే సాయిపల్లవి, కీర్తి సురేశ్ లాంటి కేరళ కుట్టీలు టాలీవుడ్ స్టార్ హీరోలతో నటిస్తూ బిజీగా ఉన్నారు. మరోవైపు మమిత బైజు లాంటి యంగ్ బ్యూటీస్ కూడా అవకాశాలు చేజిక్కుంచుకునే పనిలో ఉన్నారు. ఈ క్రమంలోనే మమిత దగ్గరకు ఓ ఊహించని అవకాశం వచ్చినట్లు తెలుస్తోంది. 'బలగం'తో దర్శకుడిగా మారిన కమెడియన్ వేణు.. అద్భుతమైన హిట్ కొట్టాడు. ఇది జరిగి చాన్నాళ్లయిపోయింది. తర్వాత 'ఎల్లమ్మ' పేరుతో ఓ సినిమా తీయాలి. అయితే ఇందులో నటించే హీరో ఎవరనే దగ్గర ఏళ్లు గడిచిపోయాయి. తొలుత నాని అనుకున్నారు కుదర్లేదు. తర్వాత నితిన్, శర్వానంద్ పేర్లు వినిపించాయి. చివరకు సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ దగ్గరకు వచ్చి ఆగింది. ఇతడు ఈ చిత్రంతో హీరోగా పరిచయమవుతున్నాడు. హీరో ఎవరో తేలిపోయింది ఇక హీరోయిన్ సంగతి చూద్దాం అని మూవీ టీమ్ అనుకున్నారు. సాయిపల్లవి, కీర్తి సురేశ్, మృణాల్ ఠాకుర్, భాగ్యశ్రీ.. ఇలా చాలా పేర్లు వినిపించాయి. ఇప్పుడీ లిస్టులోకి మలయాళ లేటెస్ట్ సెన్సేషన్ మమిత బైజు వచ్చి చేరింది. ఒకవేళ ఈ పాత్ర గనుక ఈమె చేస్తే బంపర్ ఆఫర్ అని చెప్పొచ్చు. ఎందుకంటే 'ఎల్లమ్మ'లో హీరోయిన్ పాత్రకు ఫెర్మార్మ్ చేసే స్కోప్ ఎక్కువుంది. మరి ఆ ఛాన్స్ మమితకు దక్కుతుందా? వేరే ఆప్షన్ ఏమైనా చూస్తున్నారా అనేది తెలియాల్సి ఉంది. దిల్ రాజు దీనికి నిర్మాత.

## ముంబైలో వింటేజ్ ఇల్లు..

# అంతా స్టార్ హీరోయిన్ చలవ వల్లే..



దర్శకురాలు, కొరియోగ్రాఫర్ ఫరాఖాన్ కొంతకాలంగా యూట్యూబ్‌పైనే ఎక్కువ ఫోకస్ పెట్టింది. తన వంటమనిషి దిలీప్‌తో కలిసి రకరకాల వీడియోలు చేస్తోంది. అతడిని వెంటేసుకుని సెలబ్రిటీల హోంటూర్స్ కూడా చేస్తోంది. ఈ క్రమంలోనే బాలీవుడ్ నటి తనీషా ముఖర్జీ ఇంటిని సందర్శించింది ఫరా. ముంబైలో ఉన్న ఈ ఇంట్లో అడుగుపెడితే కోల్‌కతాకు వెళ్లినట్లుగానే ఉందని అబ్బురపడిపోయింది. ఇలాంటి ఇల్లు ముంబైలో ఎక్కడా ఉండదని కితాబిచ్చింది. ఇక తనీషా మాట్లాడుతూ.. ఈ ఇంట్లోని సామాను చాలామటుకు తన తల్లి ఇంటి నుంచి వచ్చినవే అని పేర్కొంది. 14 ఏళ్ల క్రితం ముంబైలో అడుగుపెట్టానని, తర్వాత ఇక్కడే సెటిలైపోయానంది. ఈ ఇంటి కోసం మీ అక్క, హీరోయిన్ కాజోల్ ఏమైనా సాయం చేసిందా? అని ఫరా ఆతృతగా అడిగింది. అందుకు తనీషా అవునని బదులిచ్చింది. తను చెక్‌లపై సంతకం చేసి ఇచ్చేదని, అలా డబ్బు సాయం చేసిందని పేర్కొంది.

తెలుగులోనూ.. బాలీవుడ్ సెలబ్రిటీలు తనూజ– షోము ముఖర్జీల సంతానమే కాజోల్, తనీషా. తక్కువ కాలంలోనే కాజోల్ స్టార్ హీరోయిన్‌గా రాణించింది. కానీ, తనీషా ఆ స్టార్‌డమ్ అందుకోలేకపోయింది. ష్, సర్కార్, వన్ టూ త్రీ, సర్కార్ రాజ్, కోడ్ నేమ్ అబ్దుల్ వంటి పలు హిందీ చిత్రాల్లో నటించింది. తెలుగులో కంత్రి మూవీలో హీరోయిన్‌గా యాక్ట్ చేసింది. హిందీ బిగ్‌బాస్ ఏడో సీజన్‌లో పాల్గొని ఫస్ట్ రన్నరప్‌గా నిలిచింది.






# 'రాకా' నుంచి గ్లింప్స్ రాబోతుందా?..

'పుష్ప' ఫ్రాంచైజీతో దేశవ్యాప్తంగా సంచలన క్రేజ్ సంపాదించిన ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన తదుపరి చిత్రాన్ని స్టార్ డైరెక్టర్ అట్లీతో చేస్తున్న సంగతి తెలిసిందే. తాత్కాలికంగా 'రాకా' పేరుతో ప్రచారంలో ఉన్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకోణ్ కథానాయికగా నటిస్తున్న ఈ సినిమా భారతీయ సినీ పరిశ్రమలోనే అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కుతున్న చిత్రాల్లో ఒకటిగా చెప్పబడుతోంది. సినిమాకు సంబంధించిన అధికారిక వివరాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నప్పటికీ, ప్రాజెక్ట్‌పై రోజుకో కొత్త వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం, 'రాకా' సినిమా నుంచి ఫస్ట్ గ్లింప్స్‌ను ఈ ఏడాది ఆగస్టులో విడుదల చేసే దిశగా చిత్ర బృందం ప్రణాళికలు సిద్ధం చేస్తోందట. సినిమా ప్రపంచాన్ని, కథ నేపథ్యాన్ని, విజువల్ స్కేల్‌ను పరిచయం చేసే విధంగా ఈ గ్లింప్స్‌ను రూపొందిస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అట్లీ తన సినిమాల్లో భారీ విజువల్స్, మాస్ ఎలిమెంట్స్, ఎమోషనల్ కథనాలకు పేరుగాంచిన దర్శకుడు. ఈసారి అల్లు అర్జున్‌తో కలిసి అంతర్జాతీయ స్థాయి విజువల్ అనుభూతిని అందించేలా 'రాకా'ను రూపొందిస్తున్నట్లు సమాచారం. అందుకే గ్లింప్స్‌పై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ సినిమాలో అల్లు అర్జున్ పాత్రకు సంబంధించిన ఆసక్తికర వార్త కూడా వైరల్ అవుతోంది. అందుతున్న సమాచారం ప్రకారం బన్నీ ఈ చిత్రంలో మూడు విభిన్న షేడ్స్‌లో కనిపించనున్నారట. కథలో కీలకమైన మూడు దశలను ప్రతిబింబించేలా ఆయన పాత్ర డిజైన్ చేసినట్లు టాక్ వినిపిస్తోంది. అయితే దీనిపై చిత్ర బృందం నుంచి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఇప్పటికే షూటింగ్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, అట్లీ ముందుగా సిద్ధం చేసుకున్న ప్రణాళిక ప్రకారమే చిత్రీకరణ జరుగుతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ నిర్మాణ బాధ్యతలు చేపట్టింది. ఇక సంగీత బాధ్యతలను యువ సంగీత దర్శకుడు సాయి అభ్యంకార్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఆయన కంపోజ్ చేస్తున్న ట్యూన్స్‌పై చిత్ర యూనిట్ చాలా నమ్మకంగా ఉందని తెలుస్తోంది. సినిమా కథ, విజువల్స్‌తో పాటు సంగీతం కూడా ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని భావిస్తున్నారు. ప్రస్తుతం గ్లింప్స్ విడుదలపై వస్తున్న వార్తలపై అధికారికంగా క్లారిటీ లేదు. గ్లింప్స్ విడుదలైతే 'రాకా' ప్రపంచం ఎలా ఉండబోతోందో, అట్లీ–బన్నీ కాంబినేషన్ ప్రేక్షకులకు ఎలాంటి సరికొత్త అనుభూతిని అందించబోతోందో తొలి క్లారిటీ వచ్చే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# వెంకటేష్-త్రివిక్రమ్ 'ఏకే47'లో కొత్త ట్విస్ట్..

## కీలక పాత్రలో దేవయాని శర్మ?





టాలీవుడ్‌లో ప్రస్తుతం అత్యంత ఆసక్తి రేకెత్తిస్తున్న చిత్రాల్లో వెంకటేష్ -- త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47 (ఏకే47)' ఒకటి. కుటుంబ కథా చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన ఈ ఇద్దరి కలయికలో సినిమా వస్తుండటంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. గతంలో 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలకు త్రివిక్రమ్ అందించిన మాటలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇప్పుడు చాలా సంవత్సరాల తర్వాత వెంకటేష్‌తో మరోసారి కలిసి పనిచేస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై ప్రత్యేక ఆసక్తి ఏర్పడింది.ఈ సినిమాలో వెంకటేష్ సరసన శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ శరవేగంగా సాగుతోంది. కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్న తరుణంలో సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన వార్త ఫిల్మ్‌నగర్‌లో చక్కర్లు కొడుతోంది. ప్రముఖ వెబ్ సిరీస్ 'సేవ్ ది టైగర్స్' ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి దేవయాని శర్మ ఈ చిత్రంలో ఓ కీలక పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. కథలో ఆమె పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని, సినిమా నడకలో ముఖ్యమైన మలుపులకు కారణమయ్యే పాత్రగా ఉండొచ్చని సినీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఆమె పాత్రకు సంబంధించిన పూర్తి వివరాలు మాత్రం ఇంకా గోప్యంగానే ఉంచారు.దేవయాని శర్మకు ఇది కెరీర్ పరంగా మరో పెద్ద అవకాశం కానుంది. ఇప్పటికే 'సేవ్ ది టైగర్స్' ద్వారా కుటుంబ ప్రేక్షకులకు చేరువైన ఆమె, ఇప్పుడు వెంకటేష్-త్రివిక్రమ్ వంటి క్రేజీ కాంబినేషన్ సినిమాలో నటించడం ద్వారా మరింత గుర్తింపు పొందే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే, దేవయాని శర్మ నటించిన 'సేవ్ ది టైగర్స్' మూడో సీజన్ కూడా విడుదలకు సిద్ధమవుతోంది. ఇటీవల విడుదలైన ట్రైలర్‌కు మంచి స్పందన లభించింది. జూన్ 19 నుంచి ఈ సిరీస్ ప్రేక్షకుల ముందుకు రానుండగా, గత రెండు సీజన్ల మాదిరిగానే ఈసారి కూడా వినోదభరితంగా ఉండబోతుందని భావిస్తున్నారు.ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్నారు. వెంకటేష్, శ్రీనిధి శెట్టితో పాటు నారా రోహిత్, పూజిత పొన్నాడ, రావు రమేష్, బ్రహ్మజీ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సంగీతాన్ని హర్షవర్ధన్ రామేశ్వర్ అందిస్తున్నారు. కుటుంబ భావోద్వేగాలు, వినోదం, త్రివిక్రమ్ మార్క్ సంభాషణలు, వెంకటేష్ నటన ప్రధాన ఆకర్షణలుగా రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పుడు దేవయాని శర్మ ఎంట్రీ వార్తతో సినిమాపై మరింత ఆసక్తి పెరిగింది. విడుదల తేదీతో పాటు ఇతర వివరాలను చిత్ర బృందం త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.



# వాస్తవ ఘటనలతో...

బాలీవుడ్ నటి, ఎంపీ కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'భారత్ భాగ్యవిధాత'. మనోజ్ తపాడియా దర్శకత్వం వహించారు. పెన్ స్టూడియోస్ సమర్పణలో మణికర్ణిక ఫిల్మ్స్--పరమహంస్ క్రియేషన్స్ పై రూపొందిన ఈ మూవీ జూన్ 12న విడుదల కానుంది. కాగా ఈ సినిమా నుంచి తాజాగా మోషన్ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. మంటల్లో చిక్కుకున్న వారిని కంగనా కాపాడుతున్నట్లు ఈ పోస్టర్‌లో ఉంది. భారతదేశ చరిత్రలో 2008లో జరిగిన విషాదకరమైన 26/11 ముంబై ఉగ్రదాడుల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. కామా అండ్ ఆల్‌బ్లెస్ హాస్పిటల్‌లో జరిగిన వాస్తవ ఘటన ఆధారంగా రూపొందిన ఈ సినిమాలో హెడ్ నర్స్ పాత్రలో కంగనా రనౌత్ నటించారు. ఉగ్రదాడుల సమయంలో ఆసుపత్రిలోని సిబ్బంది తమ ప్రాణాలను పణంగా పెట్టి రోగులను ఎలా రక్షించారు... అనేది ఆమె పాత్ర ద్వారా చూపించబోతున్నారు మనోజ్ తపాడియా.

# చెన్నైలో జరిగే ప్రేమకథ



కిరణ్ అబ్బవరం, శ్రీగౌరిప్రియ జంటగా నటిస్తున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'చెన్నై లవ్‌స్టోరీ'. రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి సాయిరాజేష్ కథనందిస్తున్నారు. ఈ సినిమాను జూలైలో విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. చెన్నై నగరం నేపథ్యంలో జరిగే ఫీల్‌గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇదని, ప్రేమలోని సున్నిత భావోద్వేగాలను ఆవిష్కరిస్తూ అందరినీ మెప్పిస్తుందని, సంగీతానికి కూడా చాలా ప్రాధాన్యత ఉంటుందని మేకర్స్ చెప్పారు. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో తెరకెక్కిస్తున్న లవ్‌స్టోరీ ఇదని, కిరణ్ అబ్బవరం పాత్ర నవ్యరీతిలో సాగుతుందని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, కథ: సాయిరాజేష్, నిర్మాతలు: ఎస్‌కేఎన్, సాయిరాజేష్, రచన–దర్శకత్వం: రవి నంబూరి.

EDITED , PRINTED, PUBLISHED & OWNED BY PRINTED AND PUBLISHED BY MAHESH ETABONIA ON BEHALF OF NETI PRASTAVANAM MEDIA NETWORK , HNO-14-249/1/37 SAI NAGAR COLONY,MEDCHAL(V) MEDCHAL MALIKAJGIRI, -501401 at 14-249/1/37 Sai Nagar Colony, MEDCHAI, TELANGANA STATE , EDITOR : MAHESH ETABONIA :9908086026 Website : https://netiprasthanam.in/